నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
3 | నిజామాబాద్, శుక్రవారం 31 మే 2024 | ADILABAD NIRMAL

సమన్వయంతో పని చేయాలి..

డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ శ్రీఘన

సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

ఎదులాపురం, మే 30 : టీబీ వ్యాధిని 2025 నాటి వరకు పూర్తిగా నిర్మూలించడానికి పరస్పర సమన్వయంతో పని చేసుకోవాలని డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ శ్రీఘన అన్నారు. గురువారం జిల్లా రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, పార్మనాలజీ హెచ్‌వోడీ డాక్టర్ సందీప్ జాదవ్, వైద్యులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ప్రస్తుతం టీబీ బాధితులకు అందుతున్న చికిత్స, వార్డు వివరాలను అడిగి తెలుసుకున్నారు. టీబీ బాధితులకు మైరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ఈ సమావేశంలో డీటీసీవో సాయి ప్రియ, అశోక్, రిమ్స్ అసిసెంట్ ప్రొఫెసర్ రమేశ్ పవార్ పాల్గొన్నారు.

విత్తన దుకాణాల వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు

పత్తి విత్తనాల కోసం పంజాబ్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న రైతులు

కర్షకుల కన్నెర్ర

- పత్తి విత్తనాల కోసం రైతన్నల రాస్తారోకో
- మూడు రోజు ఉదయం నుంచి ఎర్రటెండలో నిరీక్షణ
- ఆర్‌సీహెచ్ 659 విత్తనాల కోసం ఎదురుచూపు
- దొరుకకపోవడంతో నిరాశతో వెనుదిరిగిన వైనం

ఆదిలాబాద్, మే 30(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో పత్తి విత్తనాల కోసం అన్నదాతలు అరిగోస పడాల్సి వస్తున్నది. మూడు రోజైన గురువారం కూడా రైతులు ఆర్‌సీహెచ్ 659 విత్తనాల కోసం భారీగా తరలివచ్చారు. వచ్చిన విత్తనాల స్టాక్ అమ్మేశామని, ప్రస్తుతం ఆ విత్తనాలు లేవంటూ రైతులకు వ్యాపారులు సూచించారు. దీంతో ఆగ్రహించిన అన్నదాతలు పంజాబ్ చౌరస్తాలో రోడ్డు బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. కాగా.. వానకాలం సమీపిస్తుండడంతో పది రోజుల నుంచి రైతులు విత్తనాలు సేకరిస్తున్నారు. తమకు కావాల్సిన ఆర్‌సీహెచ్ 659 విత్తనాల కోసం జిల్లా కేంద్రంలోని దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లాకు 27 వేల విత్తన ప్యాకెట్లు రాగా.. అధికారులు జిల్లావ్యాప్తంగా విత్తనాలు పంపిణీ చేపట్టారు. మంగళ, బుధవారాల్లో పంపిణీ చేశారు. ఈ విత్తనాల కోసం వందల సంఖ్యలో రైతులు జిల్లా కేంద్రంలోని పలు దుకాణాల ఎదుట బారులు దీరారు. పోలీసుల బందోబస్తు మధ్య విత్తనాలను పంపిణీ చేశారు. అవసరాల మేరకు ఇవ్వకపోగా.. ఒక్కొక్కరికి కేవలం రెండు ప్యాకెట్లను మాత్రమే ఇచ్చారు. అందనివారు గురువారం విత్తన దుకాణాలకు తరలివచ్చారు. తీరా స్టాక్ లేదని వ్యాపారులు సూచించగా నిరాశతో వెనుదిరిగారు. పంజాబ్ చౌక్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య, డీఎస్పీ జీవన్‌రెడ్డి నచ్చచెప్పడంతో ఆందోళన విరమించారు.

దుకాణాల వద్ద పడిగాపులు

అవసరమైన పత్తి విత్తనాలు దొరుకకపోవడంతో వారు మధ్యాహ్నం వరకు దుకాణాల వద్ద పడిగాపులు కాశారు. ఉదయం వచ్చిన రైతులకు విత్తనాలు అయిపోయాయని వ్యాపారులు చెప్పడంతో చేసేదేమీ లేక దుకాణాల వద్ద కూర్చున్నారు. విత్తనాల స్టాక్ వస్తుందేమోనని ఎదురు చూశారు. చాలా మంది రైతులు ఇతర కంపెనీల విత్తనాలను కొనుగోలు చేయడానికి ఇష్టపడకపోగా, కొందరు తప్పనిసరి పరిస్థితుల్లో తీసుకున్నారు. వారు కొనుగోలు చేసిన విత్త నాలు మంచివా? అని ఇతర రైతులను అడగడం కనిపించింది. కేవలం రెండు రోజులు మాత్రమే రెండేసి ప్యాకెట్ల చొప్పున అమ్మారని, తిరిగి స్టాక్ ఎప్పుడు వస్తుందో అని రైతుల్లో ఆందోళన కనిపించింది. కొందరు రైతులు 45 డిగ్రీల మండుటెండలో మధ్యా హ్నం వరకు దుకాణాల వద్ద కూర్చొని నిరాశతో వెనుదిరిగారు.

వ్యాపారుల ఇష్టారాజ్యం

పత్తి విత్తనాల పంపిణీలో వ్యాపారుల ఇష్టారాజ్యం కొనసాగుతుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దుకాణదారులు సరిగా పంపిణీ చేయడం లేదంటూ రైతు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. గురువారం పట్టణంలోని నిఖిల్ ఫర్టిలైజర్ నుంచి 179 ప్యాకెట్ల ఆర్‌సీహెచ్ 659 విత్తనాలను వాహనంలో ఇచ్చోడకు తరలిస్తుండగా రైతులు అడ్డుకున్నారు. జిల్లా కేంద్రంలో రైతులకు అవసరమైన విత్తనాలను పంపిణీ చేయకుండా ఇతర ప్రాంతాలకు తరలించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సదరు వ్యాపారి నిబంధనలు పాటించలేదంటూ వ్యవసాయ శాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు యజమాని రాకేశ్‌రెడ్డిపై రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో 420 యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. విత్తనాల పంపిణీలో రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని కలెక్టర్ రాజర్షి షా సూచించినా వ్యాపారులు పట్టించుకోకుండా డబ్బు సంపాదనే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు అంటున్నారు. రైతులకు సరిపడా విత్తనాలను పంపిణీ చేయని వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆర్‌సీహెచ్ 659 విత్తనాల లేవనడంతో దుకాణ మెట్లపై కూర్చున్న రైతులు

వారం రోజులుగా తిరుగుతున్నా..

నాకు 12 ఎకరాల భూమి ఉంది. కనీసం పది ప్యాకెట్లు అవసరం. పంట బాగా వస్తుందనే నమ్మకంతో ఆర్‌సీహెచ్ 659 పత్తి విత్తనాల కోసం వారం రోజుల నుంచి తిరుగుతున్నా. రెండు రోజులు క్యూలైన్‌లో నిల్చున్నా దొరకలేదు. గురువారం దొరుకుతాయనే ఆశతో ఉదయం ఏడు గంటలకే ఆటోలో వచ్చిన. పంజాబ్ చౌక్‌ల ఐదారు దుకాణాల్లో అడిగితే అయిపోయాయని చెప్పారు. ఈ విత్తనాలు ఎక్కడ అమ్ముతలేరని తెలిసింది. పగటిదాకా ఏమైనా విత్తనాలు దొరుకుతాయని చూసిన లాభం లేదు. వేరే కంపెనీ విత్తనాలు కొనాలంటే పంట సరిగ్గా వస్తుందో లేదో అనే భయమవుతున్నది. విత్తనాల విషయంలో ఏమి చేయాలో తెలియక పరేషాన్ అవుతున్నా. అధికారులను అడిగితే ఒకటో తారీఖున వస్తాయని అంటున్నరు.

- గణేశ్, రైతు, కుచులాపూర్, తలమడుగు మండలం

ఇతర కంపెనీ విత్తనాలను చూసుకుంటున్న రైతులు

గన్నీ బ్యాగుల కోసం పడిగాపులు

ఖానాపూర్ రూరల్, మే 30 : గన్నీ బ్యాగులు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. ఖానాపూర్ పట్టణంతోపాటు పలు కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగుల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. వర్షాలు వారం రోజుల్లో పడుతాయన్న వాతావరణ శాఖ సమాచారంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికీ ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని, పక్షం రోజులుగా తూకం వేయడానికి నిర్వాహకులు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీఏసీఎస్ కేంద్రం వద్ద సంచుల కోసం ఎండను కూడా లెక్క చేయకుండా గన్నీ బ్యాగుల కోసం గంటల తరబడి కాపు కాస్తున్నారు. ఐదు రోజులుగా రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గురువారం మార్కెట్ యార్డుకు 6 వేల గన్నీ బ్యాగులు రాగా.. మరో ఐదు వేలు అవసరమున్నాయని నిర్వాహకులు చెబుతున్నారు. ముందుగా వచ్చిన రైతులకు గన్నీ బ్యాగులు అందక పోవడంతో బిక్కుబిక్కు మంటున్నారు. అధికారులు స్పందించి గన్నీ బ్యాగులను అందజేయలని రైతులు కోరుతున్నారు.

ఖానాపూర్ పట్టణంలో గన్నీ బ్యాగుల కోసం మార్కెట్ యార్డులో గుమిగూడిన రైతులు

తెలంగాణ చరిత్రకు సమాధి కడుతారా?

- చిహ్నాన్ని చెరిపేసి.. గీతాన్ని మార్చడం కుట్రలో భాగమే
- స్థానికేతరుడితో రాష్ట్ర గీతానికి మార్పులు, చేర్పులు సరికాదు
- కాంగ్రెస్ సర్కారు తీరుపై మండిపడుతున్న మేధావులు, చరిత్రకారులు
- వెనక్కి తగ్గకుంటే ప్రజాగ్రహానికి గురికాకతప్పదంటూ హెచ్చరిక

మంచిర్యాల, మే 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బ కొడుతూ.. తెలంగాణ చరిత్రకు సమాధి కట్టాలని కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తున్నది. ఓరుగల్లు కేంద్రంగా పరిపాలన సాగించిన కాకతీయుల స్ఫూర్తి చిహ్నంగా ఉన్న కాకతీయ కళా తోరణం, ఎందరినో బలి తీసుకున్న ప్రాణాంతకమైన ప్లేగు మహమ్మారి అంతమైనందుకు గుర్తుగా నిర్మించుకున్న చార్మినార్‌లను రాజముద్ర నుంచి తీసేయాలని తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. తెలంగాణ ఘనమైన చరిత్రకు ఆనవాళ్లుగా నిలిచే ఈ చిహ్నాలను రాజముద్ర నుంచి తొలగించడం సరికాదని, ఈ పనిచేసే ప్రభుత్వంపై యావత్ తెలంగాణ సమాజం తిరగబడక తప్పదని మేధావులు, చరిత్రకారులు ముక్తకంఠంతో స్పష్టం చేస్తున్నారు. ఇక రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ' పాటలోని చరణాల్లోనూ కాకతీయులు, గోల్కొండ ఆనవాళ్లు లేకుండా మార్పులు, చేర్పులు చేస్తున్నట్లు తెలుస్తున్నది. పైగా తెలంగాణలో సంగీత దర్శకులు ఎవరూ లేనట్లు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ సినీ సంగీత దర్శకుడితో ఈ పాటను కంపోజ్ చేయించడంపై తెలంగాణ కళాకారులు, రచయితలు, సంగీత విద్వాంసులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఆనవాళ్లు లేకుండా చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. తెలంగాణ ప్రజలు, కళాకారులు, రచయితల మనోభావాలతో ఆడుకంటూ రాజముద్రను మార్చడం, రాష్ట్ర గీతంలో మార్పులు చేయడం, ప్రాంతియేతరులకు సంగీత బాధ్యతలు అప్పగించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ ఈ నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

దోపిడీ దొంగల అరెస్టు

దొంగల ముఠా సభ్యులను చూపుతున్న ఎస్పీ గౌష్ ఆలం

- ప్రధాన నిందితుడిపై 20 కేసులు
- సినీ ఫక్కీలో కిడ్నాప్, దొంగతనాలు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, మే 30 : జల్సాలకు అలవాటు పడిన నలుగురు యువకులు గల దొంగల ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ గౌష్ ఆలం వివరాలను వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణంలోని వడ్డెరకాలనీకి చెందిన మీర్జ ముషారఫ్‌బేగ్ అలియస్ చోటా ముషారఫ్, ముస్సు.. షేక్ బిలాల్ అలియస్ బిలాల్ అహ్మద్, జైనథ్ మండలంలోని రామయి గ్రామానికి చెందిన గజ్జే అక్షయ్, మెస్రం దత్తు అనే యువకులు జల్సాలకు అలవాటు పడి దొంగల ముఠాగా ఏర్పడ్డారు. నేరాలు చేస్తూ వచ్చిన డబ్బులతో జల్సాలు చేయడం, గంజాయి వంటి మాదకద్రవ్యాలను సేవించడం అలవాటుగా చేసుకున్నారు. డబ్బుల కోసం హత్యలు, దోపిడీలు, ద్విచక్రవాహనాలను దొంగిలించడం, ఇండ్లలో దొంగతనాలకు కూడా అలవాటు పడ్డారు. ఈ క్రమంలో ఈనెల 25వ తేదీన ఆదిలాబాద్ పట్టణం ఒక అమాయకుడి వద్ద డబ్బులు ఉన్నాయని గ్రహించారు. దోచుకుందామనే ఉద్దేశంతో ఆటోడ్రైవర్ మెస్రం దత్తు, ముషారఫ్, షేక్ బిలాల్‌లు బేల మండలానికి చెందిన మెస్రం కైలాస్‌ను నడిరోడ్డుపై ఆపి నీవు మా డబ్బులు దొంగిలించావంటూ అక్షయ్ సహాయంతో బలవంతంగా ఆటోలో కూర్చొబెట్టే ప్రయత్నం చేశారు. రాక పోయేసరికి బలవంతంగా కొట్టి అతని వద్ద ఉన్న రూ.10 వేలను బలవంతంగా లాక్కొని పారిపోయారు. బాధితుడు కైలాస్ టూ టౌన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు. సీసీ టీవీ కెమెరాల ఆధారంగా నేరస్తులను పట్టుకున్నారు.

మీర్జ ముషారఫ్ బేగ్‌పై 20 కేసులు

ఈనెల 13వ తేదీన కూడా ఇదే తరహాలో రైల్వే స్టేషన్‌లో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని కారులో వచ్చి బలవంతంగా మహారాష్ట్రకు తీసుకెళ్లారు. అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్, డబ్బులను తీసుకున్నారు. ఉండం గ్రామ శివారులోకి రాగానే మూత్ర విసర్జనకు కారు ఆపినపుడు బాధితుడు పారిపోవడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఇలా దొంగతనాలకు పాల్పడుతూ వచ్చిన డబ్బులతో జల్సాలు చేసుకోవడం ప్రారంభించారు. ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో మీర్జ ముషారఫ్ బేగ్‌పై 20 కేసులు ఉన్నాయి. ఈ సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు అశోక్, సత్యనారాయణ, ఐటీ కోర్ సిబ్బంది సంజీవ్ కుమార్, రియాజ్, క్రైమ్ పార్టీ సిబ్బంది రమేశ్, నరేశ్, క్రాంతి, నరేందర్, సుధాకర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

కారు, ఆటో స్వాధీనం

ఆదిలాబాద్ పట్టణంలో గురువారం అరెస్టు చేసిన దొంగల ముఠా వద్ద ఒక కారు, ఆటో, సెల్‌ఫోన్, రూ.4 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

గ్రూప్-1 ప్రిలిమినరీకి ఏర్పాట్లు చేయండి

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం

కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, మే 30 : జూన్ 9వ తేదీన నిర్వహించనున్న టీఎస్పీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో ఎస్పీ గౌష్ ఆలంతో కలిసి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలని, మాల్ ప్రాక్టీస్ జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రూప్-1 పరీక్ష ఉదయం 10.30 గంటల నుంచి మధ్యా హ్నం 1 గంటల వరకు ఉంటుందని తెలిపారు. పరీక్ష రాసే అభ్యర్థులు ఉదయం 9 గంటలలోపే కేంద్రాలకు చేరుకోవాలని, 9.30 గంటలకు బయోమెట్రిక్ హాజరు మొదలవుతుందన్నారు. వసతులు కల్పించాలని, నిఘా వ్యవస్థను కట్టుదిట్టం చేయాలని, సీసీ కెమెరాలు అమర్చాలని సూచించారు. సెల్‌ఫోన్‌తోపాటు ఎలక్ట్రానిక్ వస్తువులను కేంద్రాల్లోకి అనుమతించవద్దని ఆదేశించారు. 18 కేంద్రాలు, ఒక రీజనల్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. 6,729 మంది పరీక్షకు హాజరుకానున్నారని, ఇందుకు సంబంధించి రూట్ ఆఫీసర్లు ఐదుగురు, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, అబ్జర్వర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందా లు, ఇతర సిబ్బందిని నియమించామని తెలిపారు. అనంతరం ఎస్పీ గౌష్ ఆలం మాట్లాడుతూ.. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు ఆరగంట ముందే గేట్లు మూసివేస్తామని, కేంద్రా ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, మహిళా సిబ్బందిని నియమించడం, అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి పాల్గొన్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్ అర్బన్, మే 30 : నిర్మల్ జిల్లాలో గ్రూప్-1 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పరీక్ష నిర్వహణపై నోడల్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మల్ పట్టణంలో 13 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కేంద్రంలోకి అభ్యర్థులతోపాటు సిబ్బందికి మొబైల్, బూట్లు, గడియారాలు, ఆభరణాల అనుమతి లేదన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన గుర్తింపు కార్డును తీసుకురావాలని సూచించారు. ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ.. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పరీక్షను నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్ కుమార్, డీఎస్పీ గంగారెడ్డి, ఆర్డీవో రత్న కల్యాణి, జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్, పరీక్షల ప్రాంతీయ సమన్వయ కర్త గంగారెడ్డి పాల్గొన్నారు.

నిప్పుల కుంపటి

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భానుడి ఉగ్రరూపం
- రాష్ట్రంలోనే అత్యధికంగా భీమారంలో 47.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత
- ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన జనం

మంచిర్యాల, మే 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నిప్పుల కుంపటిని తలపిస్తున్నది. భానుడి ఉగ్రరూపం దాల్చడంతో ప్రజానీకం అల్లాడిపోతున్నది. గురువారం ఎండదంచికొట్టగా రికార్డు స్థాయిలో గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మంచిర్యాల జిల్లా భీమారం మండలంలో గురువారం 47.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం కుంచవెల్లిలో 46.6, కాగజ్‌నగర్‌లో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్‌లో 45.2, నిర్మల్ జిల్లా దస్తురాబాద్(బుట్టాపూర్)లో 45.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యాయి. ఉదయం 7 గంటల నుంచే చంద్రుడు నిప్పులు కురిపించగా, అత్యవసర పరిస్థితులుల్లో తప్ప ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రాలేదు. మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. రాత్రి 8 గంటల దాకా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

నార్నూర్ కుఖాయి వద్ద దాహార్తి తీర్చుకునేందుకు అవస్థలు పడుతున్న ఎద్దు

ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలి..

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్ చైన్‌గేట్, మే 30 : నిబంధనలు పాటించని ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టర్ సమావేశ మందిరంలో ఎస్పీ జానకి షర్మిలతో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌ను జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోకుండా నిర్వహిస్తున్న ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. తగిన అర్హత లేకుండా వైద్యం చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీధర్, డిప్యూటీ వైద్య, ఆరోగ్యాధికారి రాజేందర్ పాల్గొన్నారు.

బడిబాటను పకడ్బందీగా నిర్వహించాలి..

బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టర్ సమావేశ మందిరంలో బడిబాట, అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతి, ఏకరూప దుస్తుల తయారీ వంటి అంశాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జూన్ 3 నుంచి 19 వరకు మూడు విడుతల్లో బడిబాటను నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 12వ తేదీన స్వాగత దినోత్సవం, అమ్మ ఆదర్శ పాఠశాల దినోత్సవంగా ఘనంగా జరపాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా ఏకరూప దుస్తుల తయారీ పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో పురాతన ఇండ్లు, పాఠశాల భవనాలు కూల్చివేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, డీఈవో రవీందర్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, జడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఎస్పీ జానకి షర్మిల